క్లుప్తంగా

జన సమీకరణపై దృష్టి పెట్టాలి

బూర్గంపాడు: ఈ నెల 13న లక్ష్మీపురంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కానున్న ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జన సమీకరణ చేయాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. సభాస్థలిని బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం సభకు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి 60వేల మందికి తగ్గకుండా జన సమీకరణ చేయాలన్నారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి, వల్లూరిపల్లి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు బస్సులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి శబరిమలై యాత్రకు వెళ్లే స్వాములకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు భద్రాచలం డిపో మేనేజర్ బి.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శబరిమలై యాత్రకు వెళ్లే స్వాములు 35 మందితో బృందంగా ఏర్పడితే సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బస్సులో ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, ఒక సహాయకుడికి ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 27 గిరి ప్రదక్షిణాలకు అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సుతో పాటు ప్రతి ఆదివారం పంచారామాల యాత్ర కోసం నడుపుతున్నట్లు వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు భద్రాచలం బస్టాండ్‌లోని సమాచార కేంద్రం వద్ద సంప్రదించాలని తెలిపారు.

లీజ్‌కు వరికోత యంత్రం

బూర్గంపాడు: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య మంజూరు చేసిన వరికోత యంత్రం(హార్వెస్టర్)ను లీజ్‌కు ఇచ్చేందుకు ఈ నెల 10వ తేదీన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం నాగార్జున తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వరికోత యంత్రం లీజ్‌కు సంబంధించిన విధి, విధానాలు, షరతులు, అద్దె, అడ్వాన్స్ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అర్జున్‌ను గెలిపించండి

ములకలపల్లి: కార్మిక పక్షపాతి సీపీఎం అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి పిట్టల అర్జున్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు ఊకంటి రవికుమార్, గోపగాని లక్ష్మీనర్సు, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరావాలి

చండ్రుగొండ: అశ్వారావుపేట నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి పిట్టల అర్జున్ నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారని, అన్ని వర్గాలవారు పాల్గొనాలని సీపీఎం జిల్లా నాయకులు కొండపల్లి శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమలో నాయకులు ఐలూరి రామిరెడ్డి, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటాచారి, రాయి రాజా, పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంతో రాజకీయాలొద్దు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం పేరుతో రాజకీయ చేయాలని చూడడం సరికాదని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవులూరి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషమే కానీ ఎన్నికల సమయంలోనే అంబేడ్కర్ విగ్రహం స్థానిక ఎమ్మెల్యే ఇచ్చారంటూ ప్రచారం చేసుకోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. తక్షణమే ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులు స్వాధీన పరుచుకుని, ఎన్నికల అనంతరం ప్రభుత్వ అధికారులే విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

పాయం గెలుపునకు పూజలు

అశ్వాపురం: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గం అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బారాజు సంపత్ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, నాయకులు కుమ్మరి భిక్షపతి, ఆవుల రవి, రాగం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 'ఆమె'కు అన్యాయం

- పేటలో మహిళలకు అందని టికెట్
- ఏళ్ల తరబడి పనిచేసినా దక్కని ఫలితం
- నాడు పద్మావతి, నేడు నాగమణికి అదే పరాభవం




సున్నం నాగమణి


బానోతు పద్మావతి


వగ్గెల పూజ

అశ్వారావుపేట: ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు సోనియా గాంధీ నేతృత్వంలో.. ఖమ్మం జిల్లాలో గతంలో మాజీ కేంద్రమంత్రి గారపాటి రేణుకాచౌదరి నాయకత్వంలో కొనసాగింది. తాజాగా ప్రియాంక సైతం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కానీ కింది స్థాయిలో పార్టీలో మహిళలకు తగిన ప్రోత్సాహం అందడం లేదు. కాంగ్రెస్ ప్రధాన ఓటు బ్యాంకుగా పేరున్న అశ్వారావుపేట నియోజకవర్గంలోనూ అదే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్షంలో ఉన్నపుడు గ్రామాల్లో బలోపేతం చేసిన ఇద్దరు మహిళా నాయకురాళ్లకు ఆ పార్టీ 'చేయి'చ్చింది. అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పాటు కాకముందు నుంచి సున్నం నాగమణి, బాణోతు పద్మావతి కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించారు. సున్నం నాగమణి 2006లో దమ్మపేట జెడ్పీటీసీ సభ్యురాలిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2007 నుంచి 2012 వరకు దమ్మపేట మండల మహిళా కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షురాలిగా, 2012 నుంచి 2016 వరకు ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా, 2013 నుంచి 2015వరకు దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్పర్సన్ (కాంగ్రెస్ నామినేటెడ్)గా, 2016 నుంచి టీపీసీసీ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తుఉన్నారు. ప్రస్తుతం ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పాటయినప్పటి నుంచి అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం కోసం ప్రతి సారీ ఎదురు చూసిన సున్నం నాగమణికి 2009, 14లో వగ్గెల మిత్రసేనకు టికెట్ ఇవ్వడంతో మిన్నకుండిపోయారు. 2018లో పొత్తులో టీడీపీకి టికెట్ కేటాయించి గొంతు నొక్కేశారు. తాజాగా జారే ఆదినారాయణకు టికెట్ కేటాయించారు. ఇలా పార్టీకి సేవలందిస్తూనే ప్రతి సారీ టికెట్‌కు నోచుకోలేకపోయింది.

విరమించుకున్న బానోతు పద్మావతి..

మాజీ కేంద్ర మంత్రి గారపాటి రేణుకా చౌదరి శిష్యురాలిగా పేరుగాంచిన బానోతు పద్మావతి 2006 నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందించారు. 2007లో ఏపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పనిచేశారు. అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పాటయిన తర్వాత 2009లో సీనియర్ అనే పేరుతో వగ్గెల మిత్రసేనకు టికెట్ కేటాయించారు. మిత్రసేన, బాణోతు పద్మావతి ఇద్దరూ రేణుకా చౌదరి వర్గీయులే అయినప్పటికీ సాటి మహిళకు టికెట్ దక్కలేదు. 2014 ఎన్నికల ముందు వరకు వైఎస్సార్‌సీపీలో కొనసాగిన పద్మావతి తాటి వెంకటేశ్వర్లు చేరిక అనంతరం తిరిగి కాంగ్రెస్‌కు వెళ్లిపోయారు. సిట్టింగ్ ఎమ్మెల్యే వగ్గెల మిత్రసేన ఉండటంతోపాటు అప్పటికే ఆయన గ్రాఫ్ తగ్గినా.. ఆమెకు 2014లోనూ అవకాశం దక్కలేదు. ఇక 2018లో మహాకూటమి ఒప్పందంలో టీడీపీకి వెళ్లిపోతున్నప్పటికీ మేడం కూడా తన శిష్యురాలి కోసం ఏమీ చేయలేకపోయారని నాడు కన్నీరుమున్నీరయ్యారు.

ఫలితం దక్కని వగ్గెల పూజ..

మరోవైపు, వగ్గెల మిత్రసేన కుటుంబానికి చెందిన వగ్గెల పూజ గత కొంత కాలంగా కాంగ్రెస్‌పార్టీ తరుపున విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇంటి పేరైనా కలిసొస్తుందనే ఆశాభావంతో ఉంది. నెలల పసిబిడ్డతో సీనియర్లకు పోటీగా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రచారం చేసి పలువురిని ఆకర్షించింది. వర్గపోరులో ఏదో ఒక కోణంలో తనకు టికెట్ దక్కకపోతుందా అనే ఆశతో ఎదురుచూసింది. కానీ నిరాశే మిగిలింది.

నామినేషన్‌కు సిద్ధమైన నాగమణి

ములకలపల్లి: నియోజకవర్గ పార్టీ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానుల నిర్ణయం మేరకు అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా నేడు తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకురాలు సున్నం నాగమణి తెలిపారు. ఆస్తులు అమ్మి, ఆరోగ్యం పాడుచేసుకుని 17 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకోసం పనిచేస్తున్నానని, అయినప్పటికే టికెట్ కేటాయించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మండలపరిధిలోని మాదారం గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్ని సమస్యలు ఎదురైనా తాను పార్టీ మారకుండా ఉన్నానని, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటూ కాంగ్రెస్‌ను కాపాడుకుంటూ వచ్చానని అన్నారు.

తనకు బీ-ఫాం రాలేదని ఆగ్రహానికి గురైన తన అభిమానులు తనకు తెలియకుండానే కాంగ్రెస్ అధిష్టానంపై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారని తెలిపారు. ఈ విషయంలో మన్నించాలని ఆమె కోరారు. సమావేశంలో ములకలపల్లి, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ తాండ్ర ప్రభాకర్‌రావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, వనమా గాంధీ, దారం గోవిందరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు బూరుగుపల్లి పద్మశ్రీ, ముష్టిన శిరీష, పుష్పాల హనుమంతు, అంజుం, ఖాదర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు దాఖలు



అశ్వారావుపేట: నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారే ఆదినారాయణ


భద్రాచలం: నామినేషన్‌ను అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మ


భద్రాచలం: నామినేషన్ అందజేస్తున్న సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి బుధవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. విద్యార్థుల రాజకీయ పార్టీ తరపున గుగులోత్ రమేష్, స్వతంత్ర అభ్యర్థిగా కోడం వెంకటేశ్వర్లులు తమ నామినేషన్ పత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్‌కు అందజేశారు.

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో బుధవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీజేపీ తరుపున కుంజా ధర్మ, ఆయనకు డమ్మీగా ఆయన కుమారుడు కుంజా సంతోష్‌కుమార్, సీపీఎం పార్టీ తరుపున కారం పుల్లయ్యలు రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు అందజేశారు. తొలుత వీరు ర్యాలీగా కేంద్రానికి చేరుకున్నారు.

అశ్వారావుపేటలో నలుగురు..

అశ్వారావుపేట: అశ్వారావుపేట(ఎస్టీ) నియోజకవర్గానికి బుధవారం నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ, ఆదాబ్ పార్టీ అభ్యర్థి వాసం పోలయ్య, అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థి పద్దం వెంకటరమణ, గోండ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థి ఊకే రవి ఉన్నారు. కాగా, జారే ఆదినారాయణ ఆస్తులు, అప్పులను అఫిడవిట్ పొందుపరిచారు. ఆయన, కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తులు మొత్తం రూ.56లక్షల 97వేల 652 కాగా అప్పులు రూ.17లక్షల 01వెయ్యి, 88గా చూపారు.

చర్లలో తనిఖీలు

చర్ల: మండలంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. బుధవారం మండలంలోని కుదునూరు, కలివేరు, చర్ల, ఆర్ కొత్తగూడెం ప్రాంతాల్లో మోహరించిన పోలీసులు.. వచ్చి పోయే వాహనాలను ఆపి నిశితంగా తనిఖీ చేశారు. ఎన్నికల బహిష్కరణకు మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో వాహనాలలో వచ్చి పోయే వారి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ బి.రాజగోపాల్ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలు నిర్వహించగా, సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలు రక్తహీనత, ఆయుర్వేద జీవనశైలీ, ఔషధాల విశిష్టత, వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది జి.రాధిక, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌దే గెలుపు

అన్నపురెడ్డిపల్లి: ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీదే గెలుపు అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మెచ్చా నాగేశ్వరరావును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: బూర్గంపాడు మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షునిగా దాసరి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆవుల వెంకటరమణారెడ్డి, కోశాధికారిగా మేడి శేషగిరిని ఎన్నుకోగా.. జిల్లా ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్‌రెడ్డి, కోశాధికారి బెల్లం అనిల్, గౌరవ అధ్యక్షులుగా మారుతీ ప్రకాష్, కన్వీనర్ పంపన రమేష్ తదితరులు హాజరయ్యారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా సబ్దర్‌హుస్సేన్

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండకు చెందిన మహ్మద్ సబ్దర్‌హుసేన్‌ను ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు బుధవారం లేఖ విడుదల చేశారు. సబ్దర్ నియామకం పట్ల ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌కు కీలక నేతల రాజీనామా

చర్ల: చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు, డీసీఎంఎస్ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పరుచూరి రవికుమార్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ చేరి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పిలుపు మేరకు పరుచూరి రవికుమార్‌తో పాటు సహకార సంఘ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు పందిళ్లపల్లి రాధాకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధికార ప్రతినిధి బండి వేణుతో పాటు పలువురు ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చర్ల మండలంలో గట్టి దెబ్బ తగలనున్నది.

సభను విజయవంతం చేయాలి

మణుగూరురూరల్: ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ పినపాక నియోజకవర్గ కన్వీనర్ ఉసికెల కొండయ్య పిలుపునిచ్చారు. మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని ఉడతానేని గుంపు గ్రామంలో ఆయన మహాసభ పోస్టర్లను పంపిణీ చేస్తూ.. ప్రచారం నిర్వహించారు. సభకు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులతో పాటు మాదిగలు, మాదిగ ఉపకులాల వారు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పలు నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థుల ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. -సాక్షి నెట్‌వర్క్


చండ్రుగొండ: కేక్ కట్ చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు


గ్రామాల్లో పోస్టర్లు అంటిస్తున్న పోలీసులు

గుండాల: ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసీల అభివృద్ధికి అడ్డుకట్ట వేసే మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తప్పవని సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. మావోయిస్టులను నిర్మూలిద్దాం అంటూ మావోయిస్టు ఫోటోలతో ఉన్న వాల్ పోస్టర్లను మండలంలోని పలు గ్రామాలలో బుధవారం పోలీసులు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసాంఘిక శక్తుల వల్ల అభివృద్ధికి ఆటంకమే గాని ప్రయోజనం లేదని, ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకుని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. పోస్టర్లలోని మావోలు ఎవరైనా కనిపించినట్లయితే వెంటనే పోస్టర్‌లో సూచించిన కింది ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాంబాబు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం రండి!


సీపీఐ కార్యాలయంలో అయోధ్యతో సమావేశమైన పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యను బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో కలిశారు. కాంగ్రెస్ సీపీఐ పొత్తుపై ఉత్కంఠ వీడడంతో ప్రచారంలో భాగంగా సీపీఐని కలుపుకుపోయే పనిలో భాగంగా సీపీఐ ముఖ్య నాయకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగింది. కలిసి పనిచేద్దాం రండి అంటూ అయోధ్యను, ముఖ్య కార్యకర్తలను కాంగ్రెస్ నాయకులు కోరారు. జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తానంటూ అయోధ్య తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు సరెడ్డి పుల్లారెడ్డి, సర్వర్, దుర్గొగ్యల సుధాకర్, ఆర్.లక్ష్మీనారాయణ తదితర నాయకులు ఉన్నారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ కేవి రావు, శ్రీనివాసరెడ్డి, ఖదీర్ తదితరులున్నారు.

కలెక్టర్‌కు భూనిర్వాసితుల వినతి

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని మల్లేపల్లి, ఎగ్గడిగూడెం, పద్మగూడెంలో సింగరేణి సంస్థ ఉపరితల గని కోసం నివాసాలు, భూములతో పాటు సర్వస్వం కోల్పోయిన తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలకు గురువారం ఆయా ప్రాంతాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఉపరితల గని కోసం ఇల్లులు, భూములు కోల్పోయిన తమకు ఉద్యోగం కల్పిస్తానని హామీనిచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. తమను సింగరేణి పూర్తి నిర్లక్ష్యం చేస్తూ నేటికీ ల్యాండ్ లూసర్ పత్రాలు కూడా ఇవ్వలేదని, తాము ఉంటున్న సింగరేణి ప్రభావిత గ్రామాలైన కేసీఆర్ నగర్, కట్టుమల్లారం, జయశంకర్ నగర్, అయోధ్య నగర్, కొత్తమల్లేపల్లి గ్రామాల్లో సీఎస్ఆర్ ఫండ్స్ వినియోగం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలు వివరించగా, సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారన్నారు. రాసమల్ల సాగర్, పవన్‌కల్యాణ్, క్రాంతికిరణ్, అనిల్, సురేశ్, నగేశ్, అశోక్, నర్సింహారావు, పిల్లి సందీప్, జక్కుల మురళి, డేగల క్రాంతికుమార్ ఉన్నారు.

నేను ఖచ్చితంగా ఓటు వేస్తా !



బ్యానర్‌తో ఆర్ఓ ప్రతీక్ జైన్

మణుగూరురూరల్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తూ ముద్రించిన 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తా' అనే బ్యానర్‌ను పినపాక నియోజకవర్గ ఆర్ఓ ప్రతీక్ జైన్ బుధవారం ఆవిష్కరించారు. ఓటు హక్కు ప్రధాన్యత, దానిని పౌరులు వినియోగించుకోవాల్సి ఆవిష్యకతను ఈ బ్యానర్ వ్యక్త పరుస్తోంది. ప్రజల్లో అవగాహనను నింపనుంది. ఈ సందర్భంగా ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


కుదునూరులో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

చర్ల: ఈ నెల 30న జరిగే శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చర్ల సీఐ బి.రాజగోపాల్ సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కుదునూరు, కలివేరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక నిఘాను ఉంచామని, ఘర్షణలకు పాల్పడే వారి పూర్తి సమాచారం తమ వద్ద ఉందని హెచ్చరించారు. ఇప్పటికే అల్లర్లు సృష్టించే కొందరిని బైండోవర్ చేశామని, మరి కొందరిపై కూడా ఇదే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సందర్భంలో ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా ఒక్కసారి కేసు నమోదయితే ప్రతీ ఎన్నికల సందర్భంలోనూ వారిపై నిఘా ఉంచి, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు పోలీసు కస్టడీలోనే ఉంచుతామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ సదస్సులలో ఎస్సై టీవీఆర్ సూరి, సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొర్రీలు లేకుండా రుణాలివ్వాలి

గుండాల: కాచినపల్లి బ్యాంకు ద్వారా రైతులకు ఇచ్చే పంట రుణాలపై ఎటువంటి కొర్రీలు లేకుండా అందించాలని జగ్గు తండ రైతులు కోరారు. బుధవారం బ్యాంకు ముందు విలేకరులతో మాట్లాడుతూ.. ఖరీఫ్ పంట అయిపోయి యాసంగి పంటలు సాగు చేసే సమయం ఆసన్నమైందని, అయినప్పటికీ రుణాలు అందించడంలో జాప్యం జరుగుతోందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు పంట రుణాలు అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. జాటోత్ చాప్ల, ఇస్లావత్ హరిచంద్, గుగులోతు రవి, ఇస్లావత్ పార్వతి, బుక్య బుజ్జి, గూగుల్ బంగారి, భూక్య హోలీ, విజయం భూక్య భద్రమ్మ, బాలు, సురేష్, ఇస్లావత్ సౌమ్య, కమిలి, మోహన్ పాల్గొన్నారు.

జోరుగా పార్టీల ప్రచారం

30న జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు వాడవాడలా తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు. పార్టీల మేనిఫెస్టోలను వివరిస్తు తమ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరుతున్నారు. ఆయా కార్యక్రమాల్లో సంబంధిత పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


కరకగూడెం: కొత్తగూడెంలోని ప్రచారంలో విప్ రేగా కాంతారావు


అశ్వారావుపేట: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మెచ్చా నాగేశ్వరరావు


మణుగూరుటౌన్: ఆదర్శ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు